స్కూల్ అసిస్టెంట్ : సోషల్

# జాతీయ ఆదాయం భావనలు

**జా**తీయ ఆదాయం అంటే ఒక సంవత్సర కాలంలో ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి అయిన అంత్య వస్తు సేవల ప్రవాహ ద్రవ్య రూప కొలమానం. సూక్ష్మంగా చెప్పాలంటే ఒక సంవత్సర కాలంలో ఒక దేశంలో ఉత్పత్తి చేసిన వస్తు సేవల విలువే జాతీయ ఆదాయం. ఇందులో ప్రభుత్వం ఉత్పత్తి చేసిన వస్తు సేవలు కూడా ఇమిడి ఉంటాయి. ఒక దేశం జాతీయ ఆదాయాన్ని నిర్ణయించడంలో ఆ దేశపు ఎగుమతి దిగుమతులు కూడా ప్రముఖ పాత్ర వహిస్తాయి.

## నిర్వచనాలు:

1. 'తుది వినియోగదారులు భౌతిక లేదా మానవ పరిసరాల నుంచి పొందే సేవల సముదాయమే జాతీయాదాయం.' **– ఫిషర్**
2. 'ద్రవ్యంతో కొలిచే ఆర్థిక వ్యవస్థ నిరపేక్ష ఆదాయాన్ని, విదేశాల నుంచి లభించే నికర ఆదాయాన్ని జాతీయోత్పత్తి అనవచ్చు.' **– పిగూ**
3. 'ఒక దేశంలో ఒక సంవత్సర కాలంలో ప్రవహించే వస్తు సేవల ద్రవ్య విలువనే జాతీయాదాయం అనవచ్చు.' **– ఆచార్య శామ్యూల్‌సన్**

## జాతీయ ఆదాయం ముఖ్య భావనలు:

1. **స్థూల జాతీయోత్పత్తి:** Gross National Product (GNP)
   ఇది రెండు విధాలు
   1) మార్కెట్ ధరల్లో స్థూల జాతీయోత్పత్తి
   2) ఉత్పత్తి కారకాల దృష్ట్యా స్థూల జాతీయోత్పత్తి
2. **నికర జాతీయోత్పత్తి:** Net National Product (NNP)
   ఇది రెండు రకాలు
   1) మార్కెట్ ధరల్లో నికర జాతీయోత్పత్తి
   2) ఉత్పత్తి కారకాల దృష్ట్యా నికర జాతీయోత్పత్తి
3. **స్థూల దేశీయోత్పత్తి:** Gross Domestic Product (GDP)
   ఇది రెండు విధాలు
   1) మార్కెట్ ధరల్లో స్థూల దేశీయోత్పత్తి
   2) ఉత్పత్తి కారకాల దృష్ట్యా స్థూల దేశీయోత్పత్తి
4. **నికర దేశీయోత్పత్తి:** Net Domestic Product (NDP)
   ఇది రెండు రకాలు
   1) మార్కెట్ ధరల్లో నికర దేశీయోత్పత్తి
   2) ఉత్పత్తి కారకాల దృష్ట్యా నికర దేశీయోత్పత్తి

www.sakshieducation.com

**1. స్థూల జాతీయోత్పత్తి (GNP):**

ఒక సంవత్సర కాలంలో ఒక దేశంలో ఉత్పత్తి చేసిన అన్ని అంత్య వస్తుసేవల విలువ స్థూల జాతీయోత్పత్తి. ఈ నిర్వచనంలో అంత్య వస్తువులు మాత్రమే ఇమిడి ఉంటాయి. మధ్యస్థ వస్తువుల విలువ ఉండదు.

ఈ భావనలో జాతీయాదాయాన్ని ఎవరు ఉత్పత్తి చేశారు అనేది ముఖ్యం. ఎక్కడ ఉత్పత్తి అయిందో ముఖ్యం కాదు. అంటే మన దేశస్థులు విదేశాల్లో ఉద్యోగాలు చేస్తూ మనదేశానికి ద్రవ్యాన్ని పంపితే ఆ పరిమాణాన్ని మన దేశ జాతీయాదాయంలో కలపాలి. ఏ వస్తువునూ రెండుసార్లు లెక్కించరాదు. అంతిమ వస్తువుల విలువలు మాత్రమే లెక్కలోకి తీసుకోవాలి.

**స్థూల జాతీయోత్పత్తిలో అంశాలు:**

ఎ) వినియోగ వస్తు సేవల విలువ (C)

బి) మూలనిధి వస్తువుల విలువ (I)

సి) ప్రభుత్వం ఉత్పత్తి చేసిన వస్తు సేవల విలువను ప్రభుత్వ వ్యయం అని కూడా అంటారు (G)

డి) విదేశాల నుంచి నికర రాబడులు (X–M)

ఇ) విదేశాల నుంచి నికర ఆదాయ బదిలీల విలువ (R – P)

ఎఫ్) పన్నులు–పరోక్ష పన్నులు: ఒక వస్తువు ధరలో దాని ఉత్పత్తి ఖర్చు, పరోక్ష పన్ను చేరతాయి. కాబట్టి వాస్తవిక వ్యయాన్ని తెలుసుకోవటం కోసం పన్నుల ఖర్చును వ్యవకలనం చేయాలి. సాధారణంగా వస్తువు ధరలో ఉత్పత్తి ఖర్చు, అమ్మకపు పన్ను కూడా ఇమిడి ఉంటాయి. అందువల్ల మార్కెట్ ధర, వస్తువు అసలు ధరను లేదా కారకపు ధరను తెలపదు. కాబట్టి అసలు ధర లేదా కారకపు ధరను తెలుసుకొనేందుకు మార్కెట్ ధర నుంచి పన్నులను తీసివేయాలి.

జి) సబ్సిడీ: సబ్సిడీల వల్ల కూడా వస్తువు అసలు ధర మారుతుంది. మనదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కొన్నిచోట్ల ఉత్పత్తిదారులకు సహాయం చేసేందుకు ప్రభుత్వాలు వారిని ఉత్పత్తి కారకాలను మార్కెట్ ధర కన్నా తక్కువ ధరకు కొనేందుకు ప్రోత్సహిస్తాయి. దీన్నే సబ్సిడీ విధానం అంటారు.

i) మార్కెట్ ధరల్లో స్థూల జాతీయోత్పత్తి (GNP at Matket Price) = C + I + G +(X – M) + (R – P)

ii) ఉత్పత్తి కారకాల దృష్ట్యా జాతీయోత్పత్తి (GNP at Factor Cost) = C+I+G+ (X – M) +(R – P)– IT+S

**2. నికర జాతీయోత్పత్తి (NNP):**

స్థూల జాతీయోత్పత్తి నుంచి తరుగుదలను తీసేస్తే నికర జాతీయోత్పత్తి వస్తుంది. ఎలాగంటే వస్తువులను ఉత్పత్తి చేసేటప్పుడు, మూలధన సామాగ్రిలో తరుగుదల ఏర్పడి, మూలధన ఆస్తుల విలువ తక్కువవుతుంది.

ఎ) మార్కెట్ ధరల్లో నికర జాతీయోత్పత్తి = మార్కెట్ ధరల్లో స్థూల జాతీయోత్పత్తి – తరుగుదల.

బి) ఉత్పత్తి కారకాల దృష్ట్యా నికర జాతీయోత్పత్తి = ఉత్పత్తి కారకాల దృష్ట్యా స్థూల జాతీయోత్పత్తి – తరుగుదల. ఉత్పత్తి కారకాల దృష్ట్యా నికర జాతీయోత్పత్తిని జాతీయ ఆదాయం అంటారు.

**3. స్థూల దేశీయోత్పత్తి:**

స్థూల దేశీయోత్పత్తికి, స్థూల జాతీయోత్పత్తికి భేదం ఉంది. స్థూల దేశీయోత్పత్తిలో విదేశాల నుంచి ఆదాయం ఉండదు. ఏడాది కాలంలో దేశం ఎంత ఆదాయాన్ని సంపాదించిందో లెక్కిస్తారు.

ఎ) మార్కెట్ ధరల్లో స్థూల జాతీయోత్పత్తి నుంచి విదేశాల నుంచి వచ్చే నికర ఆదాయాన్ని తీసేస్తే వచ్చిందే ఒక దేశం మార్కెట్ ధరల్లో స్థూల దేశీయోత్పత్తి. అంటే GDP=GNP–(R–P). కాబట్టి ఒక దేశంలో ఉత్పత్తి అయిన

అంతిమ వస్తు సేవల మొత్తం విలువ ఆ దేశం స్థూల దేశీయోత్పత్తి.

GDP at Market Price = GNP at Market Price – (R – P) = C + I + G + (*X* – M)

బి) ఉత్పత్తి కారకాల దృష్ట్యా స్థూల దేశీయోత్పత్తి

ఉత్పత్తి కారకాల దృష్ట్యా స్థూల జాతీయోత్పత్తి నుంచి విదేశాల నుంచి వచ్చే ఆదాయాన్ని తీసేస్తే వచ్చిందే ఉత్పత్తి కారకాల దృష్ట్యా స్థూల దేశీయోత్పత్తి. అందువల్ల..

GDP at factor cost = GNP at factor cost – (R –P)= C + I + G +(*X* – M) – IT + S

4. **నికర దేశీయోత్పత్తి (NDP):**

నికర దేశీయోత్పత్తి తెలుసుకొనేందుకు, స్థూల దేశీయోత్పత్తి నుంచి తరుగుదల Dను తీసేయాలి.

ఎ) మార్కెట్ ధరల్లో నికర దేశీయోత్పత్తి = మార్కెట్ ధరల్లో స్థూల దేశీయోత్పత్తి– తరుగుదల = C + I + G + (*X* – M) – D

బి) ఉత్పత్తి కారకాల దృష్ట్యా నికర దేశీయోత్పత్తి = ఉత్పత్తి కారకాల దృష్ట్యా స్థూల దేశీయోత్పత్తి – తరుగుదల = C+I+G+(*X* – M) – IT + S–D

## వ్యష్టి ఆదాయం:

ఒక సంవత్సర కాలంలో దేశంలోని వ్యక్తులకు, సంస్థలకు లభించిన మొత్తం ఆదాయాన్ని 'వ్యష్టి ఆదాయం' అంటారు. ఉత్పత్తి కారకాల దృష్ట్యా జాతీయాదాయం నుంచి కార్పొరేట్ పన్నులు, సాంఘిక సంక్షేమ విరాళాలు, పంపకం కాని లాభాలు మినహాయించాల్సి ఉంటుంది. దీంతోపాటు ఆదాయంలో కొంత భాగాన్ని ఉత్పత్తిలో పాల్గొనకపోయినా చెల్లించాల్సి ఉంటుంది. అవి పెన్షన్లు, నిరుద్యోగ భృతి, ప్రభుత్వ రుణాలపై వడ్డీ మొదలైనవి. వీటిని 'బదిలీ చెల్లింపులు' అంటారు.

వ్యష్టి ఆదాయం = జాతీయాదాయం – కార్పోరేట్ పన్నులు + పంచి పెట్టని లాభాలు + సాంఘిక సంక్షేమ విరాళాలు + బదిలీ చెల్లింపులు

## వ్యయార్హ ఆదాయం:

వ్యక్తులకు, సంస్థలకు వచ్చే ఆదాయాన్ని వ్యష్టి ఆదాయం అంటారు. వ్యక్తులు ఈ మొత్తాన్ని ఖర్చుచేసే అవకాశం ఉం డదు. ఇందులో నుంచి ప్రత్యక్ష పన్నులైన ఆస్తిపన్ను, ఆదా యం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వ్యష్టి ఆదాయం నుంచి ఈ మొత్తాన్ని తీసేస్తే మిగిలింది వ్యయార్హ ఆదాయం.

- వ్యష్టి ఆదాయం–వ్యష్టి పన్నులు = వ్యయార్హ ఆదాయం

## తలసరి ఆదాయం:

జాతీయాదాయాన్ని దేశంలో ఉన్న జనాభాతో భాగిస్తే వచ్చేదే తలసరి ఆదాయం.

తలసరి ఆదాయం = జాతీయాదాయం / దేశ జనాభా

- తలసరి ఆదాయం అనేది ఒక దేశ ప్రజల సగటు ఆదా యం.ఇది ప్రజల జీవన ప్రమాణాలను తెలియజేస్తుంది.

## నామ మాత్రపు, వాస్తవ స్థూల జాతీయోత్పత్తి:

నామమాత్రపు స్థూల జాతీయోత్పత్తి అంటే ప్రస్తుత ధరలతో లెక్కించగా వచ్చే స్థూల జాతీయోత్పత్తిని నామమాత్రపు

స్థూల జాతీయోత్పత్తి అంటారు. నామమాత్రపు స్థూల జాతీయోత్పత్తిని ధరల సూచికతో భాగిస్తే వాస్తవ స్థూల జాతీయోత్పత్తి వస్తుంది.

వాస్తవ స్థూల జాతీయోత్పత్తి = నామమాత్ర స్థూల జాతీయోత్పత్తి / ధరల సూచిక

అంటే స్థిర ధరల వద్ద జాతీయోత్పత్తినే వాస్తవ స్థూల జాతీయోత్పత్తి అంటారు.

వాస్తవిక జాతీయోత్పత్తి పెరుగుదల ఆర్థికాభివృద్ధికి ముఖ్య సూచిక.

### మానవాభివృద్ధి సూచిక:

అమర్త్యసేన్ వంటి ఆర్థిక శాస్త్రవేత్తలు అభివృద్ధికి సూచికగా తలసరి ఆదాయం అసమగ్రమని, దీనికి బదులుగా మానవాభివృద్ధి సూచిక వంటి మెరుగైన సాధనాన్ని ఉపయోగించాలని సూచించారు.

ఐక్యరాజ్య సమితి మానవాభివృద్ధిని గణించేందుకు ప్రవేశ పెట్టిన సూచిక మానవ అభివృద్ధి సూచిక.

ఐక్యరాజ్య సమితి అభివృద్ధి పథకం తయారుచేసిన మొదటి మానవ అభివృద్ధి రిపోర్ట్, మహబూబ్ ఉల్ హక్ ఆధ్వర్యంలో 1990లో ప్రవేశపెట్టారు.

## ముఖ్యాంశాలు

- ఒక సంవత్సర కాలంలో ఒక ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తి అయిన అంతిమ వస్తు సేవల ద్రవ్యరూపమే జాతీయాదాయం.
- ఒక దేశ ప్రజల జీవనస్థాయి జాతీయాదాయపు లెక్కల వల్ల వస్తుంది.
- జాతీయాదాయాన్ని లెక్కించేటప్పుడు ఎగుమతి, దిగుమతి విలువలను కూడా లెక్కించాలి.
- ఒక సంవత్సర కాలంలో ఒక దేశంలో ఉత్పత్తి అయిన అన్ని అంతిమ వస్తు సేవల విలువ స్థూల జాతీయోత్పత్తి.
- జాతీయాదాయంలో స్థూల జాతీయోత్పత్తి, నికర జాతీయోత్పత్తి, స్థూల దేశీయోత్పత్తి, నికర దేశీయోత్పత్తి అనే నాలుగు అంశాలుంటాయి.
- స్థూల దేశీయోత్పత్తి తెలుసుకోవాలంటే మార్కెట్ ధరల్లో స్థూల జాతీయోత్పత్తి నుంచి విదేశాల నుంచి వచ్చే నికరాదాయాన్ని తీసేయాలి.
- నికర దేశీయోత్పత్తి తెలుసుకోవాలంటే స్థూల దేశీయోత్పత్తి నుంచి తరుగుదలను తీసేయాలి.
- నికర జాతీయోత్పత్తి.. స్థూల దేశీయోత్పత్తి నుంచి తరుగుదలను తీసేస్తే వస్తుంది.
- వాస్తవ స్థూల జాతీయోత్పత్తిని లెక్కించాలంటే నామమాత్రపు స్థూల జాతీయోత్పత్తిని ధరల సూచికతో భాగించాలి.
- భారతదేశ జాతీయాదాయంలో వివిధ రంగాల నుంచి వచ్చే ఆదాయం కలిపి ఉంటుంది.

## ప్రిపరేషన్ ప్లానింగ్

- డీఎస్సీ సిలబస్‌లో తక్కువ ఉండి, ఎక్కువ మార్కులు సాధించే సబ్జెక్ట్ ఎకనామిక్స్.
- డీఎస్సీ సిలబస్‌లో ఎకనామిక్స్ విభాగం నుంచి 7 మార్కులకుగాను 14 ప్రశ్నలు వస్తాయి. వీటిలో తప్పనిసరిగా జాతీయ ఆదాయం – భావనలు నుంచి 1 లేదా 2 ప్రశ్నలు వస్తాయి.
- జాతీయ ఆదాయంలో ముఖ్యంగా అభ్యర్థులు GNP, NDPకి మధ్యగల తేడా, GDP, NDPకి మధ్యగల తేడాను గుర్తించి, వివిధ అంశాలను అధ్యయనం చేస్తే ఈ విభాగంలో వచ్చే ప్రశ్నలకు సులువుగా సమాధానాలు గుర్తించొచ్చు.
- జాతీయ ఆదాయంలో వివిధ భాగాల్లోని పదాలను సూచించే ఆంగ్ల అక్షరాలను గుర్తుపెట్టుకోవాలి.

- వివిధ దేశాల తలసరి ఆదాయంతో పాటుగా భారతదేశం తలసరి ఆదాయాన్ని, ప్రజల జీవన ప్రమాణాలను తెలుసుకోవాలి.
- ఈ విభాగంలో సమీకరణాలను గుర్తు పెట్టుకొన్నట్లయితే డీఎస్సీ అభ్యర్థికి ఒక మార్కు చేతిలో ఉన్నట్లే.

www.sakshieducation.com